క్లుప్తంగా

350 మందికి వైద్య పరీక్షలు



మక్కపేట(వత్సవాయి): జయప్రద ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో మక్కపేటలోని ఎన్కేఆర్ కల్యాణమండపంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు పాల్గొని మొత్తం 350 మందికి దంత, కంటి, షుగర్, గుండె, నరాల జబ్బులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కంటి ఆపరేషన్ల అవసరమైన ఉచితం ఆపరేషన్లు చేయించి కళ్లజోళ్లను అందిస్తామని ఫౌండేషన్ కోఆర్డినేటర్ కట్టా వెంకటనరసింహారావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లెల శివప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ మల్లెల గాంధీ, ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం జిల్లా అధ్యక్షులు కామినేని భూపాలరావు తదితరులు పాల్గొన్నారు.

పీడీఓలతో సమావేశం



పెనుగంచిప్రోలు: పింఛన్ల పంపిణీని సమర్థవంతంగా నిర్వహించాలని ఇన్చార్జి ఎంపీడీఓ సిద్దారెడ్డి ఆదేశించారు. పింఛన్ల పంపిణీ ప్రక్రియపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన పీడీఓలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పింఛన్ల పంపిణీలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉదయం ఆరున్నర గంటల నుంచే పింఛన్ల పంపిణీ చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీవో కె వీ సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి పాలనపై ప్రజల్లో సంతృప్తి: సౌమ్య

నందిగామరూరల్: కూటమి ఏడాది పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. మండలంలోని లింగాలపాడు, తక్కెళ్లపాడు గ్రామాల్లో గురువారం సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏడాది కాలంగా రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కూటమితోనే సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో వీరంకి వీరాస్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం



జగ్గయ్యపేట అర్బన్: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనదని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్ ఉపాధ్యాయిని ఆలూరి సుజాత ఉద్యోగ విరమణ కార్యక్రమ సందర్భంగా పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఉపాధ్యాయిని సుజాత దంపతులను ఎమ్మెల్యే, ఉపాధ్యాయులు కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్ గొట్టి నాగరాజు, హెచ్ఎం హేమమాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడిని శిక్షించాలని డిమాండ్

కంచికచర్ల : మైలవరంలో పంచాయతీ కార్మికురాలిపై దాడి చేసిన వ్యక్తులపై కఠినంగా శిక్షించాలని సీఐటీయూ మండల కార్యదర్శి బెజ్జం భూషణం డిమాండ్ చేశారు. మైలవరం పంచాయతీలో కార్మికురాలిగా పనిచేస్తున్న బిజిలి భవానిపై టీడీపీ నాయకుడు కఠాని ఉమామహేశ్వరరావు విచక్షణారహితంగా దాడిచేయటాన్ని ఖండిస్తూ స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులు గురువారం నిరసన ప్రదర్శన చేశారు. భవానిపై దాడిచేసిన ఆ వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు చెల్లి సుధాకర్, కంచి గణపతి, గంటా లక్ష్మి, మాడుగుల అచ్చమ్మ, అయిలపోగు శ్రీనివాసరావు, కటారపు ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

మెట్లపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

కంచికచర్ల: మండలంలోని కీసరలో చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ బాటిళ్లు ఏరుకుని జీవించే ఓ వ్యక్తి స్థానిక కల్యాణ మండపం వద్ద మెట్లు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడటంతో మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ విశ్వనాథ్ కథనం మేరకు.. పెనుగంచిప్రోలు మండలం నవాబుపేట గ్రామానికి చెందిన ఆంద్రియ(54) కొంతకాలంగా కీసర ప్రసన్నాంజనేయస్వామి ఆలయ కల్యాణ మండపంలో ఉంటున్నాడు. ఈక్రమంలో గురువారం పూటుగా మద్యం సేవించి కల్యాణ మండపం మెట్లు ఎక్కుతూ కాలుజారి కిందపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సుపరిపాలన కాదు..రెడ్‌బుక్ పాలన



ముక్త్యాలలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు



పల్లగిరిలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జగ్గయ్యపేట: అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో సుపరిపాలన అందిస్తామని హామీలిచ్చిన సీఎం చంద్రబాబు, అధికారంలోకి వచ్చాక రెడ్‌బుక్ పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు విమర్శించారు. జగ్గయ్యపేట మండలంలోని ముక్త్యాల, కె.అగ్రహారం గ్రామాల్లో గురువారం 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో పేరుతో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా తన్నీరు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను అమలుచేయకుండా సుపరిపాలన పేరుతో గ్రామాల్లోకి వస్తున్న కూటమి నాయకులను ప్రజలు ఆయా హామీలపై ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పలేకపోతున్నారన్నారు. రాష్ట్రంలో 13నెలల్లో అప్పులు తప్ప సూపర్ సిక్స్ పథకాల అమలు లేదన్నారు.

40ఏళ్ల పాలనానుభవం అని చెప్పుకునే సీఎం చంద్రబాబు, ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలి ధనార్జనే ధ్యేయంగానే పాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామాల్లో నేటివరకు కనీస అభివృద్ధి జరగకపోయినా అంతా చేసేశామని కూటమి నాయకులు గొప్పలు చెప్పుకుంటుండటం హాస్యాస్పదమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 90శాతం పనులు పూర్తయిన గ్రామసచివాలయం, రైతుభరోసా కేంద్రం, విలేజ్ క్లీనిక్ భవనాల మిగులు పనులను పూర్తిచేయడంలో కూటమి ప్రభుత్వం ఏడాదిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం వారి పాలన తీరుకు నిదర్శమని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బూడిద నరసింహారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవ శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి వెంకట రమణ, ఐటీ వింగ్ నియోజకవర్గ కన్వీనర్ బండి రంజిత్, ఎస్సీ, బీసీ సెల్ నాయకులు నరసింహారావు, షాఉద్దీన్, గోపి, బజారు సాయి, యండ్రాతి ప్రకాశరావు, మచ్చా సూర్యనారాయణ, నాగుల్‌మీరా, మణి, దాసరి శ్రీను, మొండెం లింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ చంద్రబాబు మోసాలు..

వత్సవాయి: గత ఎన్నికల సమయంలో ఇష్టారీతిన హామీలు ఇచ్చి, తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీల అమలును పట్టించుకోని కూటమి పాలకులు ప్రజలను మోసం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ వత్సవాయి మండల అధ్యక్షులు గుత్తా శంకరరావు విమర్శించారు. మండలంలోని దబ్బాకుపల్లి, పెంట్యాలవారిగూడెం గ్రామాల్లో గురువారం 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ మోసాలను గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల గురించి ప్రశ్నిస్తుంటే కూటమి నాయకులు తట్టుకోలేకపోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేసి కక్షపూరిత చర్యలకు పాల్పడుతోందన్నారు. కూటమి ప్రభుత్వ అక్రమ కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచులు కొట్టె నగేష్, వడ్డే పరమయ్య, జిల్లా నాయకులు రూప్లానాయక్, లేళ్ల నాగేంద్రరెడ్డి, యేశపోగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హామీలిచ్చారు..అమలు మరిచారు!

నందిగామరూరల్: ఎన్నికలకు ముందు కూటమి నేతలిచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఏడాదిగా హామీలుగానే మిగిలిపోయాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి నెలకుదిటి శివనాగేశ్వరరావు, మండల కన్వీనర్ మంచాల చంద్రశేఖర్ విమర్శించారు. మండలంలోని పల్లగిరి, అంబారుపేట గ్రామాల్లో గురువారం రాత్రి 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన సీఎం చంద్రబాబు, కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక ఆ హామీల అమలు అంశాన్ని పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సూపర్ సిక్స్ హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, విస్మరించిన హామీలను ప్రజలను వివరించాలని సూచించారు. అనంతరం పల్లగిరి గ్రామ కన్వీనర్‌గా శ్రీనివాసరెడ్డి, అంబారుపేట గ్రామ కన్వీనర్‌గా గోరంట్ల శ్రీనివాసరావును ఎంపిక చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చాగంటి రవికిరణ్‌రెడ్డి, ఐలపోగు రమ, ఎంపీటీసీ సభ్యుడు వేల్పుల రాము, నాయకులు గరికపాటి భాస్కరం, చిలుకూరి బుచ్చిరెడ్డి, కటారపు సురేష్, పెసరమల్లి స్టాలిన్, షేక్ అలీషా, రంగారెడ్డి, వెంకటనారాయణరెడ్డి, పురుషోత్తం, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీలపై కూటమి చర్యలు కక్ష పూరితం



మాట్లాడుతున్న బత్తుల రామారావు, పక్కన నాయకులు

పెనుగంచిప్రోలు: బీసీలపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బత్తుల రామారావు మండిపడ్డారు. పెనుగంచిప్రోలులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ తురక కిషోర్ గుంటూరు జిల్లా జైలు నుంచి బెయిల్‌పై విడుదల అయిన వెంటనే మరో కేసులో అరెస్ట్ చేసి జైలుకు పంపడం కూటమి ప్రభుత్వ బీసీ వ్యతిరేక కార్యకలాపాలకు నిదర్శనమన్నారు. కిశోర్‌కు కనీసం ఆయన కుటుంబ సభ్యులకు మాట్లాడే అవకాశం కూడా లేకుండా పోలీసులు వ్యవహరించిన తీరు గర్హనీయమన్నారు. కూటమి ప్రభుత్వంలో బీసీలకు రక్షణ చట్టం తీసుకువస్తామని మాయమాటలు చెప్పి నేడు అధికారంలోకి వచ్చాక బీసీలను జైలు పాలు చేస్తున్నారని విమర్శించారు. బీసీలంతా ఏకమై రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ఓటు అనే ఆయుధం ద్వారా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు చేని రాంబాబు, నియోజకవర్గ వాణిజ్య విభాగం కన్వీనర్ దేరంగుల శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు గుడిమెట్ల శంకర్, గ్రామ ప్రచార కమిటీ అధ్యక్షులు వేముల గోవర్ధన్ పాల్గొన్నారు.

కబేళాను వినియోగంలోకి తెస్తా : కమిషనర్



మాంసం విక్రేతలతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వెంకట కృష్ణారావు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని బలుసుపాడు రోడ్డులోని కబేళాలో అన్ని వసతులు కల్పించి త్వరలోనే వాడుకలోకి తీసుకురానున్నట్లు మున్సిపల్ కమిషనర్ తులసి వెంకటకృష్ణారావు తెలిపారు. ఈ మేరకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన పట్టణంలోని మాంసం విక్రయదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మాంసం విక్రేతలంతా ఆయా జంతువులను కబేళాలోనే వధించాలని ఆదేశించారు. షాపుల వద్ద, ఇతర ప్రాంతాలలో జంతు వధ చేయరాదన్నారు. వెటర్నరీ వైద్యులు ధ్రువీకరించిన మీదటే జంతువధ చేయాలన్నారు. వినియోగదారులు కూడా వైద్యుని ధ్రువీకరణ ముద్ర ఉన్న మాంసాన్ని మాత్రమే కొనుగోలు చేయడం శ్రేయస్కరమన్నారు. షాపుల్లో మాంసం చుట్టూ ఈగలు వాలకుండా మెస్‌లు ఏర్పాటు చేసుకోవాలని వ్యాపారులకు సూచించారు.

బదిలీపై వెళ్తున్న ఎస్ఐ రాజుకు సత్కారం



ఎస్ఐ బోనగిరి రాజును సత్కరిస్తున్న పోలీసులు

కంచికచర్ల: కంచికచర్ల ఎస్ఐగా పనిచేస్తున్న బోనగిరి రాజు విజయవాడ సీసీఎస్‌కు గురువారం బదిలీ అయ్యారు. ఈసందర్భంగా ఎస్ఐ రాజును కంచికచర్ల పోలీసుస్టేషన్ సిబ్బంది దుశ్శాలువలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఎస్ఐ రాజు మాట్లాడుతూ విధి నిర్వహణలో తనకు కంచికచర్ల స్టేషన్ సిబ్బంది ఎంతగానో సహకరించారంటూ వారికి తన కృతజ్ఞతలు తెలియజేశారు.

నూతన ఎస్ఐగా విశ్వనాథ్

కంచికచర్ల ఎస్ఐగా పి. విశ్వనాథ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ రాజు విజయవాడ సీసీఎస్‌కు బదిలీకాగా, ఆస్థానంలో ఉయ్యూరులో పనిచేస్తున్న విశ్వనాథ్ బదిలీపై వచ్చి ఇక్కడ విధుల్లో చేరారు. ఈసందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పనిచేస్తానని తెలిపారు.

బోర్ల కింద వరిసాగు పనులు



వరిసాగుకు దమ్ములు చేస్తున్న రైతులు



నాట్లు వేస్తున్న కూలీలు

పెనుగంచిప్రోలు: మునేరు ప్రధాన కాలువలకు నీరు వస్తుండటంతో మునేరుతోపాటు బోర్లు కింద రైతులు ఖరీఫ్ సాగు చేపట్టారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఏటా ఖరీఫ్‌లో సుమారు 22వేల ఎకరాల్లో వరిపంట సాగవుతూ ఉంటోంది. జగ్గయ్యపేట మండలంలో 8500 ఎకరాలు, పెనుగంచిప్రోలు 7500 ఎకరాలు, వత్సవాయి మండలంలో 6వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపడతారని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. రైతులు ప్రధానంగా సాంబ మసూరి, బీపీటీ 5204 రకాల విత్తనాల సాగు చేపట్టారు. పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు, గుమ్మడిదూర్రు, వత్సవాయి మండలంలో ఆళ్లూరుపాడు, రేగులగడ్డ రైతులు మునేరు, బోర్లు, బావులు, చెరువుల కింద ఉన్న పొలాలను సాగుచేస్తున్నారు. ఎరువులు, పురుగుమందులను మోతాదుకు మించి వాడరాదని, వాటి వినియోగంలో తగిన జాగ్రత్తలు పాటించాలని పెనుగంచిప్రోలు వ్యవసాయాధికారి రామసుబ్బారెడ్డి రైతులకు సూచిస్తున్నారు. అయితే మునేరు తువ్వకాలువకు పడిన గండ్ల పూడ్చివేత పనులను కూటమి ప్రభుత్వం చేపట్టకపోవడంతో ఆయకట్టు పరిధిలోని రైతులు ఖరీఫ్ సాగుపై ఆశలు వదులుకున్నారు. ఏడాది కాలంగా గండ్లు పూడ్చించే విషయంలో కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ ఏడాది పంటకాలాన్ని కోల్పోతున్నామని తవ్వకాలువ ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీవో



ఉస్తేపల్లి వద్ద కృష్ణానది ప్రవాహాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో బాలకృష్ణ

చందర్లపాడు(నందిగామ రూరల్): పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు వరద నీరు వస్తుండటంతో కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తోందని ఆర్డీవో కె. బాలకృష్ణ తెలిపారు. చందర్లపాడు మండలం ఉస్తేపల్లి, కాసరబాద గ్రామాల వద్ద కృష్ణానది ప్రవహాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నదీ పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా మత్స్యకారులు చేపల వేటకు, ఈతకు వెళ్లొద్దని సూచించారు. పడవలను సురక్షిత ప్రాంతాలలో నిలిపి ఉంచుకోవాలన్నారు. గ్రామాలలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా రెవెన్యూ, పోలీస్ శాఖల సిబ్బందితో తగిన జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

'మిక్'లో ముగిసిన వర్క్‌షాప్



వెంకట్ ప్రణయ్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వంశీకిరణ్, అధ్యాపకులు

కంచికచర్ల: స్థానిక మిక్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ ఇంటెంట్ ఫర్ అన్‌మాన్డ్ ఏరియల్ వెహికిల్స్' అనేఅంశంపై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ డి.వెంకట్ ప్రణయ్ మాట్లాడుతూ నేచురల్ ప్రాసెసింగ్ అప్లికేషన్లు, బయోలాజికల్ న్యూరాన్స్ ప్రజెంట్ ట్రెండ్స్ ఇన్ ఎన్ఎల్‌పీ ఇంటెంట్ రికగ్నేషన్ ఫర్ అన్‌మాన్డ్ ఏరియల్ వెహికిల్స్ గురించి అధ్యాపకులకు అవగాహన కల్పించారు. రైతు డ్రోన్ల ద్వారా పురుగుమందులు ఏ విధంగా వాడాలనే అంశాన్ని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీ వంశీకిరణ్ మాట్లాడుతూ ఇటువంటి శిక్షణల ద్వారా అధునాతన సాంకేతిక రంగంలో జరుగుతున్న మార్పులపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ ప్రణయ్‌ను కళాశాల అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల సీఈఓ డి పాండురంగారావు, మేనేజ్‌మెంట్ సభ్యులు డాక్టర్ ఎం.సుహాస్, కన్వీనర్ డాక్టర్ ఎం .అనిల్‌కుమార్, కోకన్వీనర్ డాక్టర్ సీహెచ్ పుల్లారావు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

కనులపండువగా స్వామివారి కల్యాణం



చందర్లపాడు(నందిగామ టౌన్): చందర్లపాడు మండలం గుడిమెట్ల గ్రామంలోని ద్వారక కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి కల్యాణమహోత్సవాన్ని గురువారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు లక్ష్మణస్వామి ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పలురకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన మంటపంలో వేద మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామివారి కల్యాణోత్సవంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు కోట వీరబాబు, గ్రామ నాయకులు, పెద్దసంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్



నందిగామరూరల్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు దాములూరు సర్పంచ్ గాదెల వెంకటరామారావు తెలిపారు. దాములూరులో గురువారం పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రధానవీధుల్లోని డ్రైన్‌లు, ఖాళీ ప్రదేశాలు, నీటి నిల్వ ప్రాంతాలలో బ్లీచింగ్ చల్లించడంతోపాటు మురుగు కాల్వలల్లో పూడిక తీశారు. ఓవర్‌హెడ్ ట్యాంకుల క్లోరినేషన్ చేశారు. దోమల వ్యాప్తిని నియంత్రించేందుకు ఎబేట్, మలాథీన్ పిచికారీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో అంటువ్యాధులు ప్రబలకుండా అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. గ్రామకార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పురపాలక సంఘ పరిధిలో అనధికార లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేసినవారు ఆస్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ తులసి వెంకటకృష్ణారావు గురువారం కోరారు. ఈ ఏడాది జూన్30వతేదీకి ముందు కొనుగోలు చేసినవారు అక్టోబర్ 25వ తేదీలోగా ఆన్‌లైన్ విధానంలో ఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎటువంటి వివాదాలు లేని స్థలాలను క్రమబద్ధీకరిస్తామన్నారు. దరఖాస్తుదారులు స్థలం మార్కెట్ ధరకనుగుణంగా చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం కమిషనర్ కోరారు.

నిత్యాన్నదానానికి విరాళం



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి హుజూర్‌నగర్‌కు చెందిన నక్కా రవికుమార్ దంపతులు రూ. 25 వేలను విరాళంగా అందించినట్లు ఆలయ ఏసీ సాంబశివరావు గురువారం తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు స్వామివారి శేష వస్త్రం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటినుంచి వైఎస్సార్‌సీపీ సమావేశాలు

పెనుగంచిప్రోలు: మండలంలో శుక్రవారం నుంచి 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పొన్నం కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు ఒకటో తేదీన లింగగూడెం, ముండ్లపాడు, 2న వెంగనాయకునిపాలెం, శనగపాడు, 3న కొణకంచి, నవాబుపేట, 4న కొళ్లికూళ్ల, సుబ్బాయిగూడెం, 5న వెల్దుర్తిపాడు, గుమ్మడిదుర్రు, 6న ముచ్చింతాల, శివాపురం, 7న అనిగండ్లపాడు, 8న పెనుగంచిప్రోలు, 9న వెంకటాపురం, తోటచర్ల గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. పార్టీ గ్రామ, అనుబంధ విభాగాల నాయకులను ఎంపిక చేయనున్నట్లు వివరించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): జిల్లాలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో ఆగస్టు 4వ తేదీ నుంచి తమ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ఓ ప్రకటనలో తెలిపారు. కట్టింగ్ అండ్ టైలరింగ్, డ్రస్ మేకింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, జ్యూట్ క్రాఫ్ట్ మేకింగ్ అసిస్టెంట్, ప్రొడక్ట్ మేకర్, బ్యూటీ కేర్ అసిస్టెంట్, మెషీన్ ఎంబ్రాయిడరీ, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, ఏసీ, రిఫ్రిజిరేటర్ మెకానిజం, హోమ్ క్రాఫ్ట్స్ మేకింగ్, స్క్రీన్ ప్రింటింగ్, బాతిక్ ప్రింటింగ్, ఫ్రూట్స్ అండ్ వెజిటెబుల్ ప్రాసెసింగ్ అసిస్టెంట్, డ్రస్ మేకర్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ అసిస్టెంట్, ఫ్యాషన్ జ్యూవెలరీ మేకింగ్, మిర్రర్ వర్క్ అంశాల్లో శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లో ఉన్న తమ సంస్థ కార్యాలయంలో నేరుగా గానీ, 0866-2470420లో గానీ సంప్రదించాల్సిందిగా ఆమె కోరారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని 12 వ వార్డు ధనంబోడు కాలనీకి వెళ్లే రోడ్‌లో ఉన్న శ్రీనాగలక్ష్మి అమ్మవారి దేవస్థానం రహదారి ముఖద్వారం వద్ద నూతనంగా ఏర్పాటు చేయనున్న రోడ్డు పనులను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర గురువారం ప్రారంభించారు. తొలుత పూజలు చేసి పనులను ప్రారంభించారు. వార్డు కౌన్సిలర్ వేదులాపురి అలేఖ్య సైదా, ఆలయ అర్చకులు సాంబయ్య, దేవస్థానం కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఫెడరేషన్ చైర్మన్..

జగ్గయ్యపేట అర్బన్: కుమ్మరి శాలివాహన రాష్ట్ర ఫెడరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ గురువారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య ఈశ్వర్‌ను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, స్థానిక శాలివాహన సంఘ నాయకులు వల్లూరి వెంకటేశ్వర్లు, దొడ్డారపు కొండ, న్యాయవాది ఆరేపల్లి వెంకటేశ్వర్లు, శాలివాహన సంఘ పట్టణ అధ్యక్షుడు పాకాల వెంకటరెడ్డి, బాడిస చిన్నవీరయ్య, దొడ్డారపు పెద్ద గురవయ్య, రామారావు, ఆరేపల్లి రాజా, నూతలపాటి బుల్రెంకయ్య, వెంకటి, సుబ్రహ్మణ్యం, ఆరేపల్లి శ్రీను పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కంచికచర్ల: పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరిస్తేనే కాలుష్య కోరల్లో నుంచి బయటపడగలమని నందిగామ రూరల్ సర్కిల్ సీఐ చవాన్‌దేవ్ అన్నారు. స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా స్థానిక చైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో గురువారం పాఠశాల నుంచి నెహ్రూ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వ హించారు. అనంతరం మానవహారం చేశారు. పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యాన్ని వివరిస్తూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఈసందర్భంగా సీఐ చవాన్‌దేవ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ మొక్కలను నాటడంతోపాటు వాటిని సంరక్షించాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుధాకర్, ఏఎస్ఐ నాగేశ్వరరావు, సీఆర్పీ కిరణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యదర్శులతో సమీక్ష

వీరులపాడు: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామకార్యదర్శులు ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఎంపీడీవో రాజు ఆదేశించారు. జుజ్జూరులోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన మండలంలోని ఆయా గ్రామాల కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా నీటినిల్వలు లేకుండా చూడటంతోపాటు ఖాళీ ప్రదేశాలు, మురుగు కాల్వల వెంబడి బ్లీచింగ్ చల్లించాలని సూచించారు.